

గంగమ్మకు ఎంపీ, కమిషనర్ల సారె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, తాతయ్యగుంట గంగమ్మ తల్లికి ఆదివారం కమిషనర్ మౌర్య, తిరుపతి ఎంపీ గురుమూర్తి కుటుంబ సమేతంగా వచ్చి సారె సమర్పించారు.

జీవో 117 రద్దు చేయకుంటే... ఉద్యమం.. ఉధృతం

మే 20న దేశవ్యాప్త సమ్మె

- నేడు కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ నిరసన
- స్పందించకుంటే 15న విద్యా భవన్ ముట్టడి

విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమించనున్నారు. 3,4,5 తరగతుల విలీనం, జిఓ 117 పేరుతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలు చేపట్టడం దుర్మార్గమని వాపోతున్నారు. ఉపాధ్యాయుల సంఖ్య తగ్గించి పనిభారం పెంచిందని, ఫలితంగా 10 లక్షలమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి తరలిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిఓ 117 రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలంగా తయారు చేస్తామని చెప్పిన టిడిపి ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న దుర్మార్గమని పేర్కొంటూ నేడు జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవడం గమనార్హం. - ప్రజాశక్తి, తిరుపతి

పాఠశాలల పున: వ్యవస్థీకరణ, బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారమై పాఠశాల విద్యాశాఖ అనుసరిస్తున్న ప్రభుత్వ వైఖరిని విద్యార్థి ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రికగ్నైజుడు ఉపాధ్యాయ సంఘాలతో ప్రతీవారం విద్యాశాఖ అధికారులు సమావేశమై చర్చిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖాధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏకపక్షంగా చేపడుతున్న చర్యల వల్ల విద్యారంగం నష్టపోతుందని ఆందోళన చెందుతున్నారు. కొత్తగా 779 హైస్కూల్సు అప్గ్రేడ్ చేయడం, 9652 మోడల్ ప్రైమరీ స్కూల్సు ఏర్పాటు చేయడం హర్షణీయమే అయినా హైస్కూల్సులో 54మంది విద్యార్థులు ఉంటేనే 2వ పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్ పోస్టులు సర్ ప్లస్ అవుతున్నాయి. మోడల్ ప్రైమరీ స్కూల్సుకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్ స్కూల్సు, బేసిక్ ప్రైమరీ స్కూల్సును నిర్వీర్యం చేస్తున్నడం విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తోందని ఉపాధ్యాయులు తీవ్ర విచారణ వ్యక్తం చేస్తున్నాం గమనార్హం.

జీవో నెంబర్ 117 ను రద్దు చేయాలి : యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ

జీవో నెంబర్ 117ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలంగా తయారు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా గత ప్రభుత్వ బాటలోనే ప్రయాణించడం విచారకరం. ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించి పనిభారం పెంచుతోంది. హైస్కూల్సులో 54మంది విద్యార్థులు ఉంటేనే 2వ పోస్టులు కేటాయిస్తామనే నిర్ణయం తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్ పోస్టులు సర్‌ప్లస్ అవుతున్నాయి. మోడల్ ప్రైమరీ స్కూల్సుకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్ స్కూల్సు, బేసిక్ ప్రైమరీ స్కూల్సును నిర్వీర్యం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం కలెక్టరేట్ల ఎదుట ఆందోళనకు సిద్ధమయ్యాం. అప్పటికీ సమస్యలు పరిష్కంచని పక్షంలో మే 15వ తేదీన వేలాదిమంది ఉపాధ్యాయులతో విద్యాభవన్ను ముట్టడిస్తాం.

'యద్భావం తద్భవతి' పుస్తకావిష్కరణ

పుస్తకావిష్కరణ చేస్తున్న డాక్టర్ మేడసాని మోహన్, కార్యక్రమంలో ఆచార్య రాణి సదాశివమూర్తి, ఆర్సి కృష్ణ స్వామిరాజు, స్వామి సుకృతానందజి, ముని సురేష్ పిళ్ళై, గరికపాటి రమేష్ బాబు తదితరులు

ప్రజాశక్తి - క్యాంపస్ : మూర్తిమత్వం, వ్యక్తిత్వం పెంపొందాలంటే ఆధ్యాత్మిక కథలు చదవాలని శ్రీ వెంకటేశ్వర వేద విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి సూచించారు. ప్రముఖ కథా రచయిత ఆర్సి కృష్ణ స్వామిరాజు రచించిన 'యద్భావం తద్భవతి' పుస్తకాన్ని తిరుపతిలోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఆదివారం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి రామకృష్ణ మిషన్ ఆశ్రమ సెక్రెటరీ స్వామి సుకృతానందజి అధ్యక్షత వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్, పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో ప్రతి కథ, జీవన ప్రయాణానికి కావాల్సిన జాగ్రత్తలు బోధిస్తాయని వక్తలు పేర్కొన్నారు. ఈ కథలను చదివి అందులో ఉన్న విలువలను ఆచరించినప్పుడు మనిషి అంతర్గత విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు. మరో వక్త సురేష్ పిళ్ళై మాట్లాడుతూ కృష్ణ స్వామి రాజు రచించిన యద్భావం తద్భవతి పుస్తకంలో చిన్న కథలు చదువుతుంటే వేదాల సారం చిన్నచిన్న బుల్లెట్లుగా చదువుతున్నట్టు అనిపిస్తోందని కొనియాడారు. ప్రవచనకర్త గరికపాటి రమేష్ బాబు పుస్తక సమీక్ష చేశారు. ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ఏ మల్లేశ్వర రావు, ఏనుగు అంకం నాయుడు, గాలి గుణశేఖర్ నాయుడు, రమాకాంత్ శర్మ, సర్వోత్తమ రావు, చెన్నకేశవులు నాయుడు, తదితరులు హాజరై కృష్ణస్వామి రాజుని అభినందించారు.

'అన్నదాత సుఖీభవ' కౌలు రైతులకూ ఇవ్వాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అన్నదాత సుఖీభవ 20,000 రూపాయలు ప్రతి కౌలు రైతుకు ఇవ్వాలని, గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఏ.పీ.కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా, గూడూరు, సిఐటియు పార్టీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం ఏపీ కౌలు రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక రకాల పంటలకు మద్దతు ధరలు రాక రైతాంగం విల విల లాడుతున్నారన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే పాత కౌలు రైతు చట్టాన్ని రద్దుచేసి, కొత్త కౌలు రైతు చట్టాన్ని తీసుకొనిరావాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. కౌలు రైతు సంఘం గూడూరు డివిజన్ కన్వీనర్‌గా యదపర్తి దయాకర్ రెడ్డిని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సి. హెచ్.గోపాల్ రెడ్డి, డి.నారాయణరావు, రాంబాబు, గోపాల్, కే.రత్నయ్య, భాస్కర్, మస్తానమ్మ, జి.వేణు, తదితరులు కమిటీ సభ్యులుగా కొనసాగనున్నారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి. రమణయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, కెవిపిఎస్ నాయకులు ప్రసాద్, ముత్యాలయ్య, నారాయణ, ధనమ్మ, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి



మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డిని సత్కరిస్తున్న వైసీపీ నేతలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో కలిసికట్టుగా ఎండగట్టాలని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రచార వర్కింగ్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్ రెడ్డి సంయుక్తంగా పిలుపునిచ్చారు. హరిప్రసాద్ రెడ్డి ఆదివారం బియ్యపు మధుసూదన్ రెడ్డిని స్థానిక వైసిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వ పాలనలో కార్యకర్తలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హామీలు అమలు చేయలేని దుస్థితికి కూటమి చేరుకుందన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో అమ్మవారిని ఆదివారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకి ఈఓ జయకుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అంబిలిని భక్తులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గంగ తల్లి దీవెనల కోసం భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తలకు త్వరితగతిన దర్శనం కల్పిస్తున్నారని అభినందించారు. ఈనెల 13వ తేదీన గంగ జాతర సందర్భంగా భక్తులు వేలాది వచ్చే అవకాశం ఉన్నందున ఆ రద్దీకి అనునగుణంగా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎట్టకేలకు నామినేటెడ్ పదవులు భర్తీ

తుడా చైర్మన్‌గా డాలర్ దివాకర్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ క్లీనింగ్ అండ్ ప్యూరిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న నామినేట్ పోస్టులు ఎట్టకేలకు భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తుడా చైర్మన్ పదవి ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త డాలర్ దివాకర్ రెడ్డికి వరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 11 నెలలు అయిన సందర్భంగా, చైర్మన్ పదవికి ఎంతోమంది పోటీలో ఉన్నప్పటికీ డాలర్ దివాకర్ రెడ్డికి అవకాశం రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మను ఆంధ్రప్రదేశ్ క్లీనింగ్ అండ్ ప్యూరిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. జనసేన పార్టీ నుంచి డాక్టర్ హరిప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ హస్తకళా అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. గత కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న నామినేషన్ పోస్టులను భర్తీ చేయాలని ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ల వద్ద పలువురు ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా తుడా చైర్మన్ పదవికి ఇటు తిరుపతి, ఆటో చంద్రగిరి శ్రీకాళహస్తి, నగిరి, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి పలువురు పేర్లు వినబడినప్పటికీ టిడిపి అధిష్టానం డాలర్ దివాకర్ రెడ్డి వైపు మొగ్గు చూపింది. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, నగిరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌లు డాలర్ దివాకర్ రెడ్డిని బలపరచారని సమాచారం. దీనితో టిడిపి అధిష్టానం డాలర్ దివాకర్ రెడ్డిని తుడ చైర్మన్ పదవి వరించింది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో తిరుపతి అసెంబ్లీ జనసేనకు కేటాయించడం జరిగింది. సుగుణమ్మ ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేశారు. సుగుణమ్మ ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు మెంబర్, తుడా చైర్మన్ పదవుల్లో ఏదోకటి ఆశించారు. ఈ విషయమై పలుమార్లు సీఎంను కలవడం జరిగింది. తుదకు ఆమెకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లో చైర్మన్ పదవి ఇవ్వడం జరిగింది. జనసేన పార్టీ జిల్లా ఇన్చార్జిగా ఉన్న డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ కూడా అదేవిధంగా ప్రయత్నం చేసినప్పటికీ రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది. గత ఎన్నికల్లో జనసేన పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం డాక్టర్ హరిప్రసాద్ ప్రయత్నాలు చేశారు. ఆఖరి నిమిషంలో ఆరణి శ్రీనివాసులుకు జనసేన పార్టీ మీద టికెట్ ఇవ్వడంతో హరిప్రసాద్‌కు నామినేట్ పదవి లభిస్తుందని ప్రచారం జరిగింది. ఇదిలా ఉండగా తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ చైర్మన్ పదవి భర్తీ చేయకపోవడంతో చాలామంది కూటమి కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహంతో ఉన్నారు. ప్రస్తుతం గంగమ్మ జాతర జరుగుతున్నప్పటికీ ఉత్సవ కమిటీని మాత్రమే వేసి చేతులు దులుపుకోవడం జరిగింది. త్వరలో గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి.

నిరంతర సాధనే.. విజయానికి సోపానం

- కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు అవసరం
- 'ప్రతి ఒక్కరికి విద్య' నా మొదటి ప్రాధాన్యత
- సివిల్స్ ఆల్ ఇండియా 988 ర్యాంకర్ సురేష్ యాదవ్‌తో ప్రజాశక్తి ముఖాముఖి

ముఖా ముఖి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

పట్టుదలతో నిర్విరామ కృషి చేస్తే ఎంచుకున్న లక్ష్యాన్ని తప్పకుండా చేరుకోవచ్చని నిరూపించారు సివిల్స్ ఆల్ ఇండియా 988 ర్యాంకర్ పాముూరి సురేష్ యాదవ్. మట్టిలో మాణిక్యంలా, ప్రతిభకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు. కరోనా మహమ్మారి రెండుసార్లు తనను ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. ఎక్కువ యాంటీబయాటిక్స్ వినియోగం వలన వినికిడి సమస్య తలెత్తిందన్నారు. అప్పటికే ఏపీ జెన్కోలో ఏఈగా ఉద్యోగం సంపాదించిన సురేష్ యాదవ్ సివిల్స్ సర్వీసెస్‌పై ఉన్న మక్కువతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. తిరుపతి జిల్లా, నారాయణవనం మండలం. గోవిందప్ప నాయుడు కండ్రికకు చెందిన పాముూరి మురగయ్య, మునిలక్ష్మీ దంపతుల కుమారుడు ఆల్ ఇండియా సివిల్స్ సర్వీసెస్‌కు ఎంపికవడం పట్ల జిల్లా వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు.

విద్యార్థి దశ నుండి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, జీవిత లక్ష్యం వైపు అడుగులు వేసే క్రమంలో అపజయం ఆరుసార్లు తలుపు తట్టింది. ఏడవసారి విజయం కైవసం చేసుకున్నారు. విద్యతో పాటుగా ఎంతో కీలకమైన నైపుణ్యాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుంటే వారి కలను సాకారం చేసుకోవచ్చని ఆయన సూచించారు. సురేష్ యాదవ్ చిన్ననాటి నుండి సివిల్స్ సర్వీసెస్ సాధనలో తాను ఎదుర్కొన్న పరిస్థితులను ప్రజాశక్తి ప్రత్యేకంగా నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పంచుకున్నారు.

ప్రజాశక్తి: ప్రాథమిక విద్య ప్రభుత్వ పాఠశాలలో ఎలా జరిగింది? అక్కడ మీకు ఎదురైన సవాళ్లు ఏమిటి?

సురేష్ యాదవ్: నారాయణవనం మండలం, గోవిందప్పనాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్నాను. నేను చదివే రోజుల్లో రెండు మూడు సబ్జెక్టులకు కలిపి ఒకరే టీచర్ ఉండేవారు. సామాజిక శాస్త్రం సబ్జెక్టుకు ఒక టీచర్ ఉండడంతో సామాజిక అంశాలపై పట్టు సాధించగలిగాను. పుస్తకాలు కొన్ని అందుబాటులో లేకపోవడంతో బేసిక్స్ మిస్ అయ్యాను. ఆ సమయంలోనే మా పాఠశాల ఉపాధ్యాయులు న్యూస్ పేపర్లను చదవడం నేర్చుకోవాలని, దానిద్వారా ఎంతో విజ్ఞానం పొందవచ్చని సూచించారు. వారి సూచన మేరకు వార్తాపత్రికలను చదవడం ప్రారంభించాను.

ప్రజాశక్తి: మీ కళాశాల విద్యను ఎలా కొనసాగించారు?

సురేష్ యాదవ్: కళాశాల విద్యలో అక్కడి అధ్యాపకుల ప్రోత్సాహకం ఎప్పటికీ మరువలేనిది. పుల్లారెడ్డి కళాశాలలో మెకానికల్ ఇంజనీర్‌గా చదువుతున్న నాకు లైబ్రరీలో ఉన్న పుస్తకాలను చదువుకోవడానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. సెలవు రోజుల్లో కూడా లైబ్రరీ వినియోగించుకునేందుకు ప్రొఫెసర్లు అడ్డు చెప్పకుండా ప్రోత్సాహించారు. ఒక్కోసారి అర్ధరాత్రి సమయంలో కూడా లైబ్రరీలోకి వెళ్లి పుస్తకాలు చదివిన సందర్భాలు ఉన్నాయి. విద్యార్థులకు లైబ్రరీ అనేది చాలా ఉపయోగపడుతుంది. పుస్తక పఠనం ద్వారా ఎంతో నైపుణ్యతను, ఆలోచన విధానాన్ని, మాటతీరును మార్చుకునే అవకాశాలు కలుగుతాయి.

ప్రజాశక్తి: మన దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా రూపాంతరం చెందుతుంది. చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగ అవకాశానికి లక్షల్లో దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు కనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో నిరుద్యోగులకు మీరిచ్చే సూచనలు, సలహాలు ఏవి?

సురేష్ యాదవ్: మన భారత దేశంలో గ్రాడ్యుయేషన్ కోర్సులు పూర్తి చేసుకుని, ప్రతి విద్యా సంవత్సరాంతానికి, లక్షల మంది సమాజంలోనికి అడుగుపెడుతున్నారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే నేడున్న పోటీ ప్రపంచంలో ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటేనే వారి లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉంటుంది. కమ్యూనికేషన్ స్కిల్స్ లేకుండా నేడు ఉపాధి అవకాశాలు సంపాదించుకోవడం చాలా కష్టం. ప్రధానమంత్రి నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎన్రోల్మెంట్ చేసుకొని, స్కిల్ డెవలప్మెంట్ పొందే విధంగా అవకాశాలు ఉన్నాయి. వీటితోపాటు మరికొన్ని స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ కూడా నిర్వహింపబడుతున్నాయి. వీటిని అందిపుచ్చుకుంటే తప్పకుండా విజయం సాధించవచ్చు.

ప్రజాశక్తి: నేడు మారుతున్న విద్యా విధానాలతో ప్రాథమిక విద్య అనేది ఏ విధంగా కొనసాగాలి? నైపుణ్యత కలిగిన విద్యార్థిగా తీర్చిదిద్దడానికి మీరు ఇచ్చే సూచన?

సురేష్ యాదవ్: ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు విద్య పట్ల, వ్యక్తిగత ప్రవర్తనను తల్లిదండ్రులే కాకుండా ఉపాధ్యాయులు కూడా అనుసరించి, తగిన సమయంలో మెలకువలతో కూడిన మంచి మాటలను చెప్పగలిగితే నైపుణ్యత కలిగిన విద్యార్థిగా సమాజంలోకి వస్తారు. నేడు మారుమూల ప్రాంతాలలో కూడా పిల్లలను పాఠశాలలకు పంపామని సరిపెట్టుకోక, అటు తరువాత వారి ఏం చేస్తున్నారు అన్నది కూడా పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల నుండి విద్యార్థి ఇంటికి వెళ్లిన తర్వాత కూడా విద్యార్థి ఏం చేస్తున్నారు అన్న విషయాలను కూడా పట్టించుకోవలసి ఉంది.

ప్రజాశక్తి: స్మార్ట్ ఫోన్ల వలన పిల్లల్లో వచ్చే మార్పులను తెలుపగలరు?

సురేష్ యాదవ్: నేడు స్మార్ట్ ఫోన్ల వినియోగం అనేది చాలా పెరిగింది. ప్రపంచం మొత్తం అరచేతిలో ఉన్నట్టుగా స్మార్ట్ ఫోన్లో సమస్త సమాచారం అందుబాటులోకి వచ్చింది. స్మార్ట్ ఫోన్ల వలన పిల్లల్లో చాలా మార్పులు నేడు మనం గమనించవచ్చు. మంచి కన్నా చెడు చాలా వేగంగా వ్యాప్తి చెందుతుంది. స్మార్ట్ ఫోన్ల వినియోగం వలన సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారం వేగంగా ప్రజల్లోకి వెళ్ళిపోతుంది. ఇటువంటి పరిస్థితుల ద్వారా క్రిటికల్ థింకింగ్ చేయలేక చదివి అర్థం చేసుకోలేని పరిస్థితిలో ఏర్పడుతున్నాయి. స్మార్ట్ ఫోన్లను పాజిటివ్ వేలో వాడుకోవాలని నా సూచన.

ప్రజాశక్తి: గ్రామీణ ప్రాంతాలలో అక్షరాస్యత శాతాన్ని పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలంటారు?

సురేష్ యాదవ్: గ్రామీణ ప్రాంతాలు, మారుమూల గ్రామాలలో ప్రాథమిక విద్యను పూర్తి సౌకర్యాలతో, అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించుకొని ఉపాధ్యాయులు విద్యాబోధన చేయగలిగితే 100 శాతం అక్షరాస్యత పెరగడానికి అవకాశాలు ఉన్నాయి. అక్కడి గ్రామ పరిస్థితిలకు అనుగుణంగా తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయగలిగితే విద్యార్థులకు ప్రాథమిక విద్యను పటిష్టంగా అందచేయొచ్చు. అలానే గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఎంతో కీలకం. దాదాపు 80 శాతం అనారోగ్య సమస్యలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని నివారించుకుని వెసులుబాటు ప్రస్తుతం ఉంది. ఏ అనారోగ్య సమస్య అయినా మరింత పెరగకుండా కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ఉత్తమమైన మార్గం.

భక్తితో.. మాతంగి వేషం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తాతయ్య గుంట, గంగమ్మ జాతరలో ఆదివారం మాతంగి వేషం వేసి, అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పురుషులు, ఆడవారి వేషధారణ ధరించి అమ్మవారిని కీర్తిస్తారు.

శివయ్య సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఎమ్మెల్సీ కావలి గీత కుటుంబ సమేతంగా ముక్కంటిని దర్శించిన వారిలో ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేశారు.

అధ్వానంగా రైల్వే స్టేషన్ రోడ్డు

ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్ : వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో, వెంకటగిరి రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద నుండి రైల్వే గేటు అవతల వైపు ఉన్న మోడల్ స్కూల్ వరకు రోడ్డు గుంతల మయంగా ఉంది. ఈ కాస్త దూరం ప్రయాణం ఇబ్బందికరంగా ఉందని వాహనదారులు విమర్శిస్తున్నారు. రాత్రి సమయాలలో గుంతలు సరిగా కనబడక యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. రైల్వే గేటు ఇరువైపుల మలుపులు ఉన్నాయి. పెద్ద పెద్ద గుంతలు ఉన్నందున ఈ మలుపుల్లో పెద్ద వాహనాలు తిరగాలంటే ఇబ్బందిగా ఉంటోందని వాహన చోదకులు తెలిపారు. ఎదురుగా వాహనాలు వచ్చినపుడు ఆ వాహనాల లైటింగ్‌తో రోడ్డుపై గుంతల్లో పడిపోతున్నామని వాపోయారు. మున్సిపాలిటీ అధికారులు ఈ రోడ్డు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : క్రీడాకారులకు క్రమశిక్షణతో వ్యాయామం తప్పనిసరిగా చేయాలని క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని నెల్లూరు డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. గూడూరులో ఆదివారం సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు క్రికెట్ కోచింగ్ క్యాంపులకు ప్రత్యేక గుర్తింపు ఉందని, క్రీడాకారులు శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, జనార్దన్ రెడ్డి, ముని గిరీష్, అనిల్, నాగేశ్వరరావు, మస్తాన్, లవ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కంటి రామ్మోహన్ రావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, పరిసర ప్రాంతాల్లో సొంత నిధులతో పాఠశాలలు, వైద్యశాలలు నిర్మించి అనేక సేవా కార్యక్రమాల ద్వారా పేద ప్రజలకు సహాయం చేస్తున్న వ్యక్తి శ్రీకంటి రామ్మోహనరావు అని రోటరీ వెస్ట్ క్లబ్ అధ్యక్షులు నాసిన నాగులు, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డిలు పేర్కొన్నారు. గూడూరు రెండవ పట్టణంలోని మాళవ్యనగర్ సెంటర్లో ఆదివారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్, ప్రముఖ ఆడిటర్, సీనియర్ రొటేరియన్ శ్రీకంటి రామ్మోహన్ రావు జన్మదినం సందర్భంగా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి పేద ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ వెస్ట్ క్లబ్ కార్యదర్శి చోళవరం గిరిబాబు, ఏజీ వాసు గౌడ్, బండి ధనుంజయ రెడ్డి, దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేష రెడ్డి ప్రభుత్వ స్టేడియంలో హాకీ కోచ్ దీవెన్ ఆకాష్ అభ్యర్థన మేరకు 20 మంది హాకీ క్రీడాకారులకు ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు, రమేష్ బేకరీ అధినేత రమేష్, లక్ష్మీనారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ త్వరలో మరి కొంతమంది క్రీడాకారులకు స్పోర్ట్స్ వేర్, పౌష్టికాహారం పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవ సంస్థ కార్యవర్గ సభ్యులు బ్రిజర్ కాటూరి శ్రీనివాసులు, పయ్యావుల మురళి నాయుడు, రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్, టీచర్ నాగేశ్వరరావు, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం సబ్ స్టేషన్లో పనిచేస్తున్న వాచ్‌మెన్ మధు ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. అతని టిడిపి ప్రమాద బీమా, సభ్యత్వం నమోదు చేసుకుని ఉండటంతో, పార్టీ నాయకత్వం గుర్తించి 5 లక్షల రూపాయల చెక్కును ఆదివారం మధు తల్లి మల్లేశ్వరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో చెంచయ్య నాయుడు, నైనారు పొన్నారావు, రెడ్డివారి గురవారెడ్డి, చంద్రయ్య నాయుడు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు శాప్ ఛైర్మన్ సారె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి, శ్రీ తాతయ్యగుంట గంగమ్మకు జాతర సందర్భంగా ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసి అమ్మవారికి సారె సమర్పించారు. వీరితోపాటు అమ్మవారిని దర్శించుకున్నవారిలో తిరుపతి డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీయువిడీసీ డైరెక్టర్ పూజా విజయకుమార్ ఉన్నారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్‌తో కలిసి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

20న సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: సిఐటియు ఆఫీసు వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మే 20వ తేదీ దేశవ్యాప్తంగా లేబర్ కోడ్స్ రద్దు కోసం జరుగుతున్న సమ్మెలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో అతిపెద్ద స్కాం కాంట్రాక్ట్ వ్యవస్థేనన్నారు. జాతీయ సమ్మెలో ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, గోపాల్, కృష్ణయ్య, మాధురి, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మురళినాయక్ ఆశయ సాధనలో భాగమవుదాం

ప్రజాశక్తి - క్యాంపస్: ఆపరేషన్ సిందూర్‌లో దేశ సంరక్షణలో భాగంగా ప్రాణాలు అర్పించిన ఆంధ్రుడు మురళి నాయక్ ఆశయ సాధనలో భాగమవుదామని జిఐఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేంద్ర నాయక్ పిలుపునిచ్చారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రధాన గ్రంథాలయం ఎదుట ఆదివారం వీర జవాన్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నేతలు పాల్గొన్నారు.

ప్రేమావతి మరణం తీరని లోటు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి డిగ్రీ కాలేజీ అధ్యాపకురాలు డా. డి. యం. ప్రేమావతి మరణం సమాజానికి తీరని లోటని హైకోర్టు న్యాయవాది నారపరెడ్డి రాజారెడ్డి అన్నారు. ఆదివారం ఆమెకు పలువురు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అధికార భాషా సంఘం రాష్ట్ర మాజీ సభ్యురాలు మస్తానమ్మ, ఆప్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏపీ సింహాద్రి, ఆధార్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ మహమ్మద్ రఫీ, శ్రీ ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ ఆనంద్, కేపీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

భద్రత గాలికి.. నిర్మాణాలు ఆకాశానికి

- దినదినాభివృద్ధి చెందుతున్న నాయుడుపేట
- పుంజుకున్న రియల్ ఎస్టేట్
- నిర్మాణంలో నిబంధనలకు నీళ్లు
- చూసీ చూడనట్లు అధికారులు

ప్రజాశక్తి -నాయుడుపేట: తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేట పట్టణం చుట్టుపక్కల అనేక కంపెనీలు ఏర్పడడంతో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో చుట్టుపక్కల పల్లెల నుంచే కాకుండా, అనేక ప్రాంతాల నుంచి నాయుడుపేటలో స్థిరపడేందుకు ఎంతోమంది ఉత్సాహం చూపుతున్నారు. దీంతో నాయుడుపేట పట్టణ, మండల పరిధిలో రోజుకోచోట వెంచర్లు ఏర్పడుతూ పెద్దపెద్ద అపార్ట్మెంట్లు, భారీ బిల్డింగుల నిర్మాణం చేపడుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు ఇక్కడికి వచ్చి స్థిరపడితే నాయుడుపేట వాణిజ్యపరంగా కూడా ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. ఇదే అదునుగా బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు అధికారులను ప్రసన్నం చేసుకుంటూ అపార్ట్‌మెంట్స్, భారీ భవనాల అనుమతులకు నీళ్లొదిలేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళిక అధికారి (టిపిఓ) నిర్మాణం చేపట్టబోతున్న స్థలాన్ని, పరిసరాలను స్వయంగా పరిశీలించి అనుమతులు మంజూరు చేశాకే నిర్మాణాలు చేపట్టాల్సిఉంది. ఈ నిర్మాణాలు జరిగేప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉంది. కానీ నాయుడుపేట పట్టణంలో బిల్డర్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నాయుడుపేట మునిసిపాలిటీలో కొత్తగా పట్టణ ప్రణాళిక అధికారిగా బాధ్యతలు చేపట్టిన బాలసుబ్రమణ్యం నిర్మాణాల స్థలాల వద్దకు పరిశీలనకు వెళ్లకుండానే అనుమతులు జారీ చేస్తున్నాడని విమర్శలున్నాయి. ప్రజలు రద్దీ ఉండే ప్రాంతాలలో నిర్మాణాలు ఖచ్చితంగా నిబంధనలు పాటిస్తూ చేయాలి. కానీ బాధ్యత ఉన్న అధికారి స్థల పరిశీలనకు వెళ్లకుండా అసలు ఎక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపడుతున్నారో కూడా తెలియకుండా అనుమతులు జారీ చేయడంలో

అంతర్యమేమిటోనని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు అటకెక్కించి నిర్మాణాలు చేపడుతున్నా.. సదరు అధికారి చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బిల్డర్లు ఏమాత్రం భద్రతా నియమాలు పాటించకుండా నిర్మాణాలను కొనసాగిస్తుండడంతో, ఆ రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై మనుషులపై సిమెంట్, కంకర, రాళ్లు ఇలా అనేక మెటీరియల్ వారిపై పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. చుట్టు పట్టలు కట్టి భారీ నిర్మాణాలు చేపట్టాల్సిఉంటుంది, కానీ ఇక్కడ అలాంటి పద్ధతులేవి పాటించకపోవడంతో పగటిపూట అటుగా వెళ్లాలంటేనే ప్రజల హడలెత్తిపోతున్నారు. ఈ సమస్యలు సదరు అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఆయన స్వలాభం కోసం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రెగ్యులర్ అధికారిగా ఉన్న ఆయనకు నాయుడుపేట ఇన్చార్జి అధికారిగా బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన నాయుడుపేట మున్సిపాలిటీకి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. ఈ సమస్యలపై ఫోను ద్వారా ఆయనను వివరణ కోరేందుకు ప్రయత్నించగా పొంతన లేని సమాధానాలు చెబుతూ, నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అసలు నాయుడుపేట పట్టణంలో ఎన్ని నిర్మాణాలు చేయబడుతున్నారో ఆయనకి పూర్తిగా తెలియకపోవడం గమనార్హం. పట్టణంలో ఒక్క పట్టణ ప్రణాళిక అధికారి మాత్రమే కాదు, కొన్ని ముఖ్య శాఖలకు సంబంధించిన కార్యాలయాలలో ఎక్కడో పనిచేస్తున్న వారికి ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించడంతో, ఆయా శాఖా పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకి అధికారులు ఎప్పుడు వస్తుంటారో వెళుతుంటారో తెలియడం లేదు. కొన్ని శాఖలలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు పూర్తిగా చేరటం లేదన్నది వాస్తవం. వారిక్కడ రెగ్యులర్ అధికారి కాకపోవడంతో అక్కడ ఏం జరిగితే మాకెందుకన్న నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తూ అందిన వరకు జేబులు నింపుకుంటూ ప్రజల ఆవేదనను ఏమాత్రం పట్టించుకోవటం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో నాయకులు, పైఅధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పేదరికంలోని కష్టాలు తెలిసిన వారే తీర్చగలుగుతారు

- ఐఏఎస్ ఆల్ ఇండియా ర్యాంకర్ సురేష్ యాదవ్‌కు ఘనసన్మానం

సురేష్ యాదవ్ ను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సామాన్య రైతు కుటుంబంలో పుట్టి దేశ అత్యున్నత స్థాయి సివిల్స్ సర్వీసెస్‌లో 988 ర్యాంకు సాధించిన పామూరు సురేష్ యాదవ్ పేదరికంలోని కష్టాలు తెలిసిన వ్యక్తి అని, ఇటువంటి వ్యక్తులే పేదల కష్టాలు తీర్చగలుగుతారని యాదవ అభివృద్ధి, సంక్షేమం కార్పోరేషన్ చైర్మన్ గొల్ల నరసింహా యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో సివిల్స్ ర్యాంకర్ సురేష్ యాదవ్‌ను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరసింహా యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యను ప్రారంభించి, మంచి సంకల్పంతో సివిల్స్ లక్ష్యంగా ఢిల్లీకి చేరి, ఎన్నో వ్యయప్రయాసలు పడి ఆల్ ఇండియా ర్యాంకు సాధించిన సురేష్ యాదవ్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువత ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. కార్పోరేటర్ అన్నా అనిత యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజలు ఉన్నతాదికారులను కలిసి వారి సమస్యలు నేరుగా చెప్పుకునేటటువంటి వ్యవస్థను తీసుకరావాలని కోరుతున్నా మన్నారు. వెనుకబడిన తరగతులకు చెందిన సురేష్ యాదవ్ కష్టించి ఉన్నతస్థాయికి రావడం గొప్ప విషయమన్నారు. సన్మాన గ్రహీత సురేష్ యాదవ్ మాట్లాడుతూ చదువు పట్ల ఒకానొక దశలో ఆశక్తి తగ్గిందన్నారు. అబ్దుల్ కలాం, వివేకానంద పుస్తకాలను చదివి జీవిత లక్ష్యాన్ని నిర్ణయించుకున్నానని తెలిపారు. నాకు సపోర్ట్‌గా నా కుటుంబ సభ్యులు, స్నేహితులు అండగా నిలిచారని తెలిపారు. నా ప్రాధాన్యతగా విద్య, వైద్యం, వ్యవసాయం అభివృద్ధి చేయడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటానన్నారు. పిల్లలు విద్యకు దూరం కాకూడదని గ్రామ చైతన్య ఫౌండేషన్ ఏర్పాటు చేసి మారుమూల ప్రాంత విద్యార్థులకు విద్య విశిష్టతను తెలుపుతూ కార్యక్రమాలను చేశానని తెలిపారు. అనంతరం సురేష్ యాదవ్‌ను యాదవ సంఘం నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జయరాం యాదవ్ వాసు యాదవ్, హేమంత్ యాదవ్, మునస్వామి యాదవ్, బీజి క్రిష్ణయాదవ్, వెంకటముని యాదవ్, భరణి యాదవ్, శ్రీనివాసులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లూపస్ వ్యాధిపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి కరకంబాడి రోడ్డు, వినాయక సాగర్ వద్ద ఆదివారం వినాయక సాగర్ వాకర్స్ క్లబ్, శుభోదయం హాస్పిటల్స్ అధినేత డాక్టర్ దామోదరంల నేతృత్వంలో ప్రపంచ లూపాస్ దినోత్సవం సందర్భంగా వాకర్సుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ దామోదరం, డాక్టర్ రెడ్డప్ప, వాకర్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా శుభోదయం హాస్పిటల్ అధినేత డాక్టర్ దామోదరం మాట్లాడుతూ ప్రపంచ లూపస్ దినోత్సవం అనేది నివారణ లేని లూపస్ అనే చర్మవ్యాధి పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి ఏటా మే 10 వ తారీఖున జరుపుకునే కార్యక్రమమని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లూపస్ అనేది దీర్ఘకాలిక అంటువ్యాధి అనీ, అలసట, నీరసం, కీళ్లల్లో వాపు తరచూ తలనొప్పి వంటివి ఈ లోపు వ్యాధి లక్షణాలుగా చెప్పుకోవచ్చు అని తెలిపారు. డాక్టర్ రెడ్డప్ప మాట్లాడుతూ లోపాస్ వ్యాధికి కారణం వ్యాధి నిరోధక శక్తిని అందించే కణాలపై అంతర్గత దాడి అని, అయితే మిగతా ఆటో ఇమ్యూన్ వ్యాధులకు లూపస్ తేడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయకసాగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, గౌరవ అధ్యక్షులు రామస్వామి, కార్యదర్శి లాయర్ చంద్రయ్య, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సాయిబాబా రెడ్డి, శాంతి, వెంకట్ రాయల్, కృష్ణంరాజు, విజయకుమార్ రాజు , నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మురళి నాయక్‌కు నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా వీరమరణం పొందిన మురళి నాయక్‌కు ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. రాష్ట్ర యనాది సంఘం అధ్యక్షులు చందమామల కోటయ్య, జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ సంయుక్తంగా మాట్లాడుతూ మురళి నాయక్ చేసిన త్యాగం ఎప్పటికీ మరిచిపోలేనిదన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేయడమే మురళికిచ్చే అసలైన నివాళి అన్నారు.

టీటీడీ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆన్లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ విద్యాశాఖాధికారి వెంకట సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 15 నుండి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - రామచంద్రాపురం : మండల పరిధిలోని సొరకాయల పాళ్యం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఆదివారం గెట్ టుగెదర్ నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు.

తిరుచానూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుచానూరు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2001–2002 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న వారు 23 ఏళ్ల తర్వాత కలిసి, అపూర్వ కలయిక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. వివిధ హోదాలలో స్థిరపడిన నాటి విద్యార్థులు పాఠశాల దశలో వారు చేసిన అల్లరిని, ఉపాధ్యాయులతో ఆనాటి జ్ఞాపకాలను నెమరేసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి, మునికృష్ణమాచారి, తులం రామ్, హంస వేణి, భారతి, సూర్య కళ, రఘురాం, మురళి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నామకరణం కార్యక్రమంలో పాల్గొన్న మోహిత్ రెడ్డి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల నగర్ గ్రామపంచాయతీ వైసీపీ బాధ్యులు గుండ్రాజు శివశంకర్ రాజు, లక్ష్మీదేవి దంపతుల ప్రథమ కుమారుడు నితిన్ వర్మ, లతశ్రీ దంపతుల మొదటి సంతానం రాధ్య నామకరణ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు చిలమంద మునికృష్ణయ్య, మంగళం పరిధిలోని మంగళం క్వార్టర్స్, రణధీరపురం, సప్తగిరి కాలనీ, తిరుమల నగర్ గ్రామపంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, లక్ష్మీనారాయణ, గంగారపు వరలక్ష్మీ రాంబాబు, మల్లెమొగ్గల ఉమాపతి, బైరెడ్డి రమేష్, తిరుమల ప్రసాద్ బాబు, రమేష్, సారథి, శ్రావణ్, దయాకర్, వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తిరుమల నగర్ టిడిపి నూతన కమిటి ఎన్నిక



నూతన కమిటీకి నియామకపు పత్రాలను అందిస్తున్న మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ టీడీపీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళం పరిధిలోని 5 పంచాయతీలకు నూతన కమిటీల నియామకం చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు జరిగిన గ్రామ కమిటీ కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎస్ఈ గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శిగా తలారి చెన్నరాయప్ప, మహిళా అధ్యక్షురాలుగా గల్లా శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా జి. అమరావతి, 26 మందితో నూతన కమిటీ ఎనుకున్నట్లు తెలిపారు.

మంగళం క్వార్టర్స్ పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా సురేష్ నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని మంగళం క్వార్టర్స్ గ్రామపంచాయతీ టిడిపి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షులు సురేష్ నాయుడు తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కమిటీ ఎన్నికను ఆదివారం నిర్వహించమన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా రవిచంద్ర, ఉపాధ్యక్షులుగా బాలాజీ ప్రసాద్, మహిళా అధ్యక్షురాలుగా జానకి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మి, తెలుగు యువత గ్రామ కమిటీ అధ్యక్షుడు శశిధర్ బాబు, ఐటీడీపీ అధ్యక్షుడిగా వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా సాయికృష్ణ, బీసీ సెల్ అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్గా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కుల్లాయప్ప, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అన్వర్ ఖాన్, ప్రధాన కార్యదర్శి షేక్ ఆసియాలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పనపాకం గ్రామ కమిటీ అధ్యక్షులుగా బి.వెంకటేష్

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి):టీడీపీ మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు స్వంత పంచాయతీ పనపాకం గ్రామ కమిటీ అధ్యక్షులుగా బి.వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలో పార్టీ పటిష్టత కోసం ఆనవాయితీగా నిర్వహించే గ్రామ కమిటీల ఎన్నికలు జోరుగా సాగుతున్నాయి. పనపాకం పంచాయతీలో నిర్వహించిన గ్రామ కమిటీల ఎన్నికలో విశ్రాంత ఎ.ఎస్.ఐ. బి.వెంకటేష్‌ను అధ్యక్షులుగా, గ్రామ ఉపాధ్యక్షులుగా జయచంద్ర నాయుడును, ప్రదాన కార్యదర్శిగా ప్రభాకర్‌ను ఎన్నుకున్నట్లు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, కుమార్, గురవయ్య, హేమచంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: డ్రోన్ వ్యవస్థ ద్వారా అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపనున్నట్లు సీఐ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాజీవ్‌నగర్‌లో డ్రోన్ ద్వారా నిఘా ఉంచి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులోభాగంగా 4 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. బహిరంగ మద్యపానం చేస్తున్న యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా బహిరంగ ప్రదేశాల్లో ఆకతాయిలు మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించినట్లు తెలిపారు.

క్రైం న్యూస్

10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, కారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుండి అక్రమంగా వాహనంలో తరలించకపోతున్న పది ఎర్రచందనం దుంగలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రేంజి ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు శేషాచలం అటవీ పరిధి మామండూరు నార్త్ బీటులో ముందస్తుగా అందిన రహస్య సమాచారం మేరకు వాహనాల తనిఖీని చేపట్టామన్నారు. ఉదయం తెల్లవారు జామున 4 గంటలకు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ఓ కారు అతివేగంగా రావడంతో వాహనాన్ని ఆపే ప్రయత్నం చేశామన్నారు. అటవీశాఖ సిబ్బందిని గమనించిన స్మగ్లర్లు మామండూరు గ్రామ సమీపంలోని ఊటీ కాలువ వద్ద వాహనాన్ని వదిలి పారిపోయారన్నారు. స్మగ్లర్లు విడిచిపెట్టిన కారును పరిశీలించగా అందులో 259 కేజీల 10 ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. ఈ దాడులలో మామండూరు సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌస్ కరీం, ఎఫ్బిఓలు శరవణ కుమార్, జాన్ శ్యాముల్, అరవింద్ బేస్ క్యాంపస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగుంట సమీపంలో రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి - చిట్టమూరు: చిట్టమూరు మండల పరిధిలోని కొత్తగుంట సమీపంలో ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో కోట మండలం జరుగుమల్లి గ్రామానికి చెందిన ఉదయగిరి సుజిత్ కుమార్ (22), చిత్తూరు శివ (22) తిరుపతి నుంచి బైక్ మీద కోట మండలం జరుగుమల్లి సొంత ఇంటికి వస్తుండగా, కల్లు లోడుతో మలామ్ నుండి నాయుడుపేట వెళుతున్న ఆటో ఢీకొనింది. ఉదయగిరి సుజిత్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, చిత్తూరు శివ (22)కు కుడికాలు, భుజం విరిగిపోయాయి. క్షతగాత్రుడిని 108 సహాయంతో హుటాహుటిన నెల్లూరు అపోలో హాస్పిటల్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై పి బలరామయ్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలియపరిచారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

మృతి చెందిన అనందమ్మ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అగ్ని ప్రమాదంలో గాయపడిన మహిళ రుయాలో ఆదివారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్, పైడిపల్లెలో ఈనెల 9న దీపం తగిలి చీరకు నిప్పంటుకున్న ప్రమాదంలో అనందమ్మ అనే మహిళ గాయాలపాలైంది. గత కొంతకాలంగా పెరాలసిస్‌తో బాధపడుతూ అనారోగ్యంతో ఉన్న ఆమె పూజ గదిలో దీపం పెడుతూ చీరకు నిప్పు అంటుకోవడంతో గట్టిగా కేకలు వేసింది. అరుపులు విన్న కుమారుడు, భర్త, మంటలను ఆర్పి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. మృతురాలికి మతిస్థిమితం సరిగా లేదని కుమారుడు విజయ్ కుమార్ తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ ఎస్సై షేక్షావలి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వన్నెకుల క్షత్రియులు రాజకీయంగా ఎదగాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తమిళనాడు, మహాబలిపురంలో జరుగుతున్న వన్నియార్ సంఘం మహానాడు ఆత్మీయ సమావేశంలో శ్రీకాళహస్తి ప్రాంత వన్నెకుల క్షత్రియులు పాల్గొన్నారు. వన్నియార్ కుటుంబ సభ్యులను ఒక్క తాటి పైకి తీసుకొచ్చి వారిని ప్రబల రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, చిన్నారెడ్డి, ముని రత్నం రెడ్డి, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, పేట బాలాజీ రెడ్డి, యం.యస్.రెడ్డి, మునిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేశాలమ్మకు ఆరణి మదన్ సారె

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : వేశాలమ్మ తల్లికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు, ఆరణి మదన్ సారె సమర్పించారు. ఆదివారం సాయంత్రం పల్లెవీధి రామాలయం నుంచి సారెను సంప్రదాయ బద్ధంగా తీసుకువచ్చి మదన్ దంపతులు వేశాలమ్మకు సమర్పించారు. ఆలయ ఈఓ మునిశేఖర్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం వేశాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్థానికుల కొంగుబంగారంగా పూజలందుకునే వేశాలమ్మ ఆశిశ్శులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పోరేటర్ సికే రేవతి, నాయకులు సునీల్ చక్రవర్తి, బొడ్డు అశోక్, కోదండ, ఆకేపాటి సుభాషిణీ ఉత్సవ కమిటీ సభ్యులు మునిరామయ్య, జశ్వంత్, రాహుల్ యాదవ్, శిరీషా, మల్లిశెట్టి లక్ష్మీ, రాధా, రుద్ర కిషోర్ తదితరలు పాల్గొన్నారు.

కైలాస ధామానికి విరాళాలు ఇవ్వండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి):చంద్రగిరిలో చేపట్టిన మహాప్రస్థానం–కైలాస ధామానికి(గోవింద ధామం) నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు ఇవ్వాలని మహా ప్రస్థానం కమిటీ అధ్యక్షులు వీరంగారి రమేష్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం కమిటీ సభ్యులు కరపత్రాలు ప్రచురించి పంపిణీ చేశారు. చంద్రగిరి మహాప్రస్థానం సేవా సమితి పేరుతో, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఖాతా సంఖ్య 573420110000307, ఐఎఫ్ఎస్‌సి కోడ్ బికెఐడి 0005734, చంద్రగిరికి విరాళాలు పంపించాలని కోరారు.

కులగణన హర్షణీయం

ప్రజాశక్తి - క్యాంపస్ : దేశంలో జనగణనలో భాగంగా బీసీ సమగ్ర కులగణన చేయాలని తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్. ఉప్పర నాగేశ్వరరావు పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం పోరాట ఫలితంగా బిసి కులగననకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వరదరాజులు, రాయలసీమ అధ్యక్షులు విజయ ఉత్తరాది, చిత్తూరు జిల్లా అధ్యక్షులు వెంకట్ యాదవ్, పశువైద్య వర్సిటీ అధ్యక్షులు డాన్ ఏజ్రా, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదలకు న్యాయం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) టీడీపీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని రెడ్డివారిపల్లి గ్రామపంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకోబడిన కొత్తకోట నాగరాజ రాయల్ తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర రైతు కార్యదర్శి ఈశ్వరవాక శివ కోటీశ్వర రెడ్డి, ఎ.ఎం.సి చైర్మన్ గౌస్ బాషల ఆధ్వర్యంలో ఆదివారం రెడ్డివారిపల్లి పంచాయతీలో గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎగువరెడ్డివారిపల్లికి చెందిన సీనియర్ నాయకుడు కొత్తకోట నాగరాజ రాయల్‌ను అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. అలాగే కార్యదర్శిగా కుమార్‌తో సహా పదిమంది కమిటీ సభ్యులును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.